తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

శనివారం

26 సెప్టెంబర్ 2026

పేజీలు : 8

Follow :

# 20 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టబోతున్నాం

- ఇందిరమ్మ ఇల్లుకు రూ.5 లక్షలు..మరో రూ.5లక్షల రుణం..
- బహుల అంతస్తుల భవనాల నిర్మాణం..
- మున్సిపల్ కౌన్సిల్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్..







**గోదావరిఖని, జనంసాక్షి :**

రామగుండం నగరంలో 20 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించబోతున్నామని స్థానిక శాసన సభ్యులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రకటించారు.శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో హాజరైన ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో నిర్మిస్తున్న మాదిరిగా రామగుండంలో ఇందిరమ్మ టవర్స్ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయడంతో పాటు అదనంగా మరో రూ.5 లక్షలు రుణం ఇప్పించి ప్రభుత్వమే ఈ భవనాలు నిర్మించి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. రామగుండం జెన్‌కో సిటీ, ఫెర్టిలైజర్‌సిటీ, ఎన్‌టిపిసి టౌన్‌షిప్, గోదావరిఖని సిటీలు నలభయ్ ఏళ్ల క్రితమే ఇప్పటి గేటెడ్ కమ్యూనిటిలుగా అవతరించాయని అన్నారు.మహానగరంగా ఎప్పుడో మారాల్సిన నగరం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్‌ఆర్ నిధులు సుమారు 2వేల కోట్లు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లడంతో వెనుకబడి పోయిందని అన్నారు.తాను ముఖ్యమంత్రి, మంత్రుల వద్ద ఉన్న సన్నిహిత సంబంధాలతో అన్ని శాఖల నుండి రామగుండం నగరానికి నిధులు మంజూరు చేయిస్తూ ఉండడంతో ప్రస్తుతం అభివృద్ధి చురుగ్గా సాగుతున్నదని అన్నారు.నగర పాలక సంస్థ ద్వారా రూ.600 కోట్లు ఇతర శాఖల ద్వారా మరో రూ.600 కోట్లతో భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి గడించేలా రామగుండంను తీర్చిదిద్దాలనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని స్వంత ఇల్లు లేని పేదలకు ఇస్తామని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఏ వసతి లేకుండా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తే తాను ఎంఎల్‌ఏగా ఎన్నికయిన తరువాత రూ 40 కోట్లు వెచ్చించి మౌళిక వసతుల కల్పన చేసి నివాస యోగ్యంగా తీర్చిదిద్దామని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్దిదారులకే వాటిని కేటాయించడం జరిగిందని అన్నారు.పక్షపాత రహితంగా, పార్టీల కతీతంగా పేదల సంక్షేమానికి తాము కట్టుబడి పని చేస్తున్నామనడానికి ఇదే నిదర్శనమని అన్నారు.జిఓ 76 ద్వారా అలాగే ప్రభుత్వ,ప్రభుత్వ రంగ సంస్థల ఖాళీ స్థలాల్లో నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలు ఇప్పిస్తామని అన్నారు.రామగుండం నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ చొరవతో, మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తూ రామగుండం అభివృద్ధికి చేయూత నందిస్తున్నారని అన్నారు.15వ ఆర్థిక సంఘం టైడ్ , అన్ టైడ్ నిధులు రూ 15 కోట్ల 47 లక్షల 28 వేలు, ట్రాన్స్ ఫర్ డ్యూటి ఫండ్ రూ 13 కోట్ల 13 లక్షల 70 వేలు ఎల్‌ఆర్‌ఎస్, జనరల్ ఫండ్, డిస్ట్రిక్ట్ ఫండ్స్ కలిపి రూ.9 కోట్ల 67 లక్షల 13 వేలు, సిఎస్‌ఆర్ (ఎన్‌టిపిసి) ఫండ్స్ రూ.6 కోట్ల 11 లక్షల 85 వేలు,

వార్తా లోపలి పేజీలో

## భూసేకరణలో దళారుల చేతిలో మోసపోవద్దు: కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తామంటూ మోసం చేసే మధ్యవర్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నేరుగా నష్టపరిహారం చెల్లింపు

**పెద్దపల్లి,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :**


పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, ఎన్టీపీసి, సింగరేణి, రాజాపూర్ ప్రాంతాలలో జరుగుతున్న భూసేకరణతో పాటు, జాతీయ రహదారులు, రైల్వే మార్గాల విస్తరణ నిమిత్తం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా బాధితులకే నష్టపరిహారం అందుతుందని, ఎవరైనా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రామగుండం,ఎన్టీపీసి, సింగరేణి,రాజాపూర్ ప్రాంతాలలో సింగరేణి సంస్థకు సంబంధించిన భూసేకరణ జరుగుతుండగా, జిల్లాలో వివిధ ప్రాంతాలలో కొత్త జాతీయ రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణం కోసం భూములు సేకరిస్తుండగా, కొంతమంది దళారులు, మధ్యవర్తులు ప్రవేశించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తామని నమ్మిస్తూ అమాయక ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.భూమి కోల్పోతున్న బాధితులు ఎవరూ ఇలాంటి దళారులు, మధ్యవర్తుల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని, ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రావాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వ అధికారులే నేరుగా బాధితులకు తెలియజేసి అందజేస్తారని, పరిశ్రమలు, సింగరేణితో పాటు నేషనల్ హైవేస్, రైల్వే భూసేకరణ విషయాలలోనూ మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసపూరితంగా వ్యవహరించినా వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని, అనధికార వ్యక్తులను నమ్మి మోసపోవద్దు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## జలకళ సంతరించుకున్న గన్నేరువరం పెద్ద చెరువు

### ఉప్పొంగుతున్న మత్తడి.. సందడి చేస్తున్న గ్రామ ప్రజలు

**గన్నేరువరం, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**



గన్నేరువరం మండల కేంద్రంలో ముడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని పెద్ద చెరువు జలకళ సంతరించుకుంది. చెరువు పూర్తిగా నిండడంతో మత్తడి ఉప్పొంగి పొర్లుతోంది. మత్తడి దగ్గర నుంచి జలపాతంలా దూకుతున్న నీటిని చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. యువకులు మత్తడి వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.అటు వర్షాలతో చెరువులు, కుంటలు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి

### గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికం గా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**ఉమ్మడి మేడిపల్లి,సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**



జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా భీమారం మండలంలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. రాజలింగంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను పరిశీలించి, పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అనంతరం భీమారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, భవనం నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అనుకూలంగా, సురక్షితమైన వాతావరణం కల్పించే విధంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ వసంత, ఇంజనీర్ శాఖ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఏవియేషన్ రంగంలో ఆకాశమంత అవకాశాలు..

**- ఆకాశమే హద్దుగా ఎదగొచ్చు..**

**- కోర్సు ఫీజులో రూ.1.09 లక్షలు జిల్లా కలెక్టర్ భరిస్తారు..**

**- ప్రభుత్వ పాఠశాలలు..కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు అర్హులు..**

**గోదావరిఖని, జనంసాక్షి :**



విమానయాన రంగంలో రాణించి మంచి కెరీర్ని సాకారం చేసుకోవాలనుకునే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వీటిని ఉపయోగించుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు సూచించారు.హైదరాబాద్ లోని ముషారాంబాగ్‌లో ఉన్న గో ఫ్లై క్యాంపస్ ఏవియేషన్ ట్రైనింగ్ సంస్థ గోదావరిఖని విచ్చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నాడు విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు.సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నుండి ఈ సంస్థలో ట్రైనింగ్ పొందిన బి.అక్షయ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్..పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో ఏవియేషన్ రంగంలో కెరీర్‌ను స్థిరపరుచుకోవాలనుకున్న వారికి వారధి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన అవివాహిత యువతకు(18 సంవత్సరాల నుండి 27 సంవత్సరాల వరకు) ఎయిర్ హోస్టెస్, ఎయిర్పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ విభాగాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు ఇందుకోసం ప్రతి బ్యాచ్‌కి 45 మందికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారని చెప్పారు.(కోర్స్ ఫీజ్ ఒక లక్షా తొమ్మిది వేలు 1,09,000 కలెక్టర్ చెల్లిస్తారు). ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందడుగు వేయాలని ఈ సంతలో ట్రైనింగ్ పొందిన రష్మిత, సుప్రియ, అయాన్ చెప్పారు. మొత్తం ఆరు నెలల నుండి 8 నెలల పాటు అవసరమైన వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రయాణికుల సేవలు, వ్యక్తిత్వ వికాసం, గ్రూమింగ్, ఎయిర్పోర్ట్ నిర్వహణ తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ విజయవంతంగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో ప్యాసింజర్ సర్వీస్ అసిస్టెంట్, బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సర్వీస్, బిగ్ బడ్డీ తదితర విభాగాలలో నెలకు 18 వేల నుండి 25 వేల వరకు జీతం పొందే ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని తెలియజేశారు. ఈ సువర్ణ అవకాశాన్ని పెద్దపల్లి జిల్లా కు చెందిన అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు తెలిపారు. కళాశాల ప్లేస్మెంట్ సెల్ అధ్యర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో మొత్తం 65 మంది పాల్గొనగా డి.అక్షయ, చౌదరి శిరీష, అజ్మీరా కృష్ణవేణి, సాయిశ్రీజ,ఇషాఫాతిమా,అఖిల, కావ్యశ్రీ మొత్తం ఏడుగురు సెలెక్ట్ అయ్యారని ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుబ్బారావు, టీఎస్‌కేసీ మెంటార్ పి.ఉషారాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో సవిత,నివేదిత, డాక్టర్ ఏ.సురేష్, డాక్టర్ సతీష్, ప్రసాద్,అధ్యాపకులు పాల్గొన్నారు.

## డీజే సౌండ్‌పై పోలీసుల చర్య

**డీజే పరికరాలు స్వాధీనం, కేసు నమోదు**

**కోనరావుపేట(జనంసాక్షి):**




నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ నిర్వహిస్తుండటం తో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అనుమతులు లేకుండా/ నిబంధనలకు విరుద్ధంగా అధికశబ్దంతో అసౌకర్యం కలిగిస్తున్నట్లు గుర్తించారు.పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని డీజే సౌండ్‌ను నిలిపివేయడంతో పాటు, వినియోగిస్తున్న డీజే పరికరాలను , వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

## మహానుభావుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయులు

**కోనరావుపేట(జనంసాక్షి):**

అంత్యోదయ ఏకాత్మ మానవత సిద్ధాంత రూపకర్త సంఘసంస్కర్త శాస్త్రవేత్త రాజకీయ నాయకులు భారతీయ జనతా పార్టీకి పటిష్ట పునాదులు వేసిన సమర్థులు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానుభావుడు పండిట్ దీన్ దయాల్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గొట్టే రాంచందర్, జింక వెంకటి, మోతుకు మోహన్ బూత్ అధ్యక్షులు చౌవుటపెల్లి వెంకటేష్, బోయిని నర్సయ్య, శంకర్ జైహింద్ రెడ్డి, పుట్ట లింబయ్య, స్వరూప్ పాల్గొన్నారు

## బీఎంఎస్ ఆఫీస్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి..

గోదావరిఖని, జనంసాక్షి :



స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యా జయంతి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు,ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం భారతీయ ఆలోచనా విధానంలో కీలకమైనదని పేర్కొన్నారు.రామగుండం నియోజకవర్గంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ప్రముఖులు,ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షులు గుండెబోయిన భూమయ్య,లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, సింగరేణి కోల్ మైన్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుల్వ లక్ష్మీనారాయణ, పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుల్వ పద్మ, అందె రాజకుమార్, బుంగ మహేష్, పుప్పాల కుమార్, వేల్పూరి రాజయ్య, బూడిద హర్ష, నడిగొట్టు రాజేందర్, ఆంజనేయులు, శంభోజు సురేష్, ఆకునూరి రమేష్, తిరుపతి, కే. సంపత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవను మరింత విస్తృతంగా కొనసాగించాలని సంకల్పించారు.పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు, సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.




## రామగుండం కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీలను రద్దు చేయాలి..

**- రిక్షా ర్యాగ్ పిక్కర్లను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలి..**

**- ఏఐటీయూసీ డిమాండ్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత 26 సంవత్సరాలుగా కేవలం రూ.4,000 మ్యాచింగ్ గ్రాంట్‌తో రిక్షా ర్యాగ్ పిక్కర్లుగా పనిచేస్తున్న కార్మికులను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రామగుండం నగర కార్యదర్శి ఎం.ఏ.గౌస్ డిమాండ్ చేశారు.శుక్రవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన రిక్షా ర్యాగ్ పిక్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రిక్షా ర్యాగ్ పిక్కర్లు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని,ఈ వేతనాలు వారి కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 26 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరిని నగర పాలక సంస్థ పైలట్ ఏజెన్సీ పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.అణగారిన వర్గాలకు న్యాయం చేయాల్సిన నగర పాలక సంస్థ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడడం సరైంది కాదని, పైలట్ ఏజెన్సీల వల్ల వారి ఉపాధి భద్రతకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించకపోవడం వల్ల వారు చట్టపరమైన హక్కులను కోల్పోతున్నారని, కనీస వేతనాలు అమలు కావడం లేదని, పి.ఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవని,దసరా పండుగ అడ్వాన్స్ లేదని,లీవులు, సిక్‌లు లేవని, యూనిఫాం, బెల్లం, సబ్బులు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు.కనీస సౌకర్యాలు కల్పించకుండా నగర పాలక సంస్థ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటూ శ్రమ దోపిడీకి గురిచేస్తోందని ఆరోపించారు.నగరపాలక సంస్థ కమిషనర్‌కు,మేయర్‌కు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించకుండా, సరైన పరిష్కారం చూపకుండా రిక్షా ర్యాగ్ పిక్కర్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో కమిషనర్, మేయర్, కార్పొరేటర్లు స్పందించి రిక్షా ర్యాగ్ పిక్కర్లను ఔట్ సోర్సింగ్ వర్కర్లుగా గుర్తిస్తూ తీర్మానం చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రిక్షా ర్యాగ్‌పిక్కర్ కార్మికులు పాల్గొన్నారు.

## 20 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టబోతున్నాం

సిఎస్ఆర్ ( సింగరేణి) ఫండ్స్ 1 కోటి రూపాయలు, డిఎంఎఫ్‌టి నిధులు రూ.31 కోట్ల 94 లక్షల 81వేలు, యుఐడిఎఫ్‌కు సంబందించి రూ.50 కోట్లు, టియుఎఫ్ఐడిసికి సంబందించి రూ.100కోట్లు, అసిస్టెన్స్ టుది మునిసిపల్ కార్పొరేషన్ కింద రూ.20.00 కోట్లు, యుఐడిఎఫ్ వాటర్ సప్లయ్ స్కీమ్ కింద 88 కోట్ల 90 లక్షలు, అమృత్ 2.0 కింద రూ.245 కోట్లతో వాటర్ సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ తదితర పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని అన్నారు. తమ పాలక వర్గం వచ్చిన తరువాత ' ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 'కార్యక్రమం పూర్తి సాచ్యురేషన్ మోడ్‌లో అన్ని డివిజన్‌లలో చేపట్టి అన్ని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు నిర్వహించడంతో నీళ్ళు సాఫీగా ప్రవహించి ఈసారి వరద ముప్పుతప్పిందని అన్నారు.సానిటేషన్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతో ఈ సారి చికెన్ గున్యా, డెంగ్యూ వంటి అంటువ్యాధులు వ్యాపించలేదని అన్నారు. త్వరలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో రామగుండం నగర రూపు రేఖలు మారబోతున్నాయని అన్నారు. రూ 120 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్స్ రూ.25 కోట్లతో కమర్షియల్ కాంప్లెక్స్ రూ.30 కోట్లతో 7.5 మెగా వాట్ల సోలార్ పవర్ ప్లాంట్, రూ.135 కోట్లతో 55 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఇంకా అలాగే రూ.152 కోట్లతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. అభివృద్ధి తో పాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా చురుగ్గా సాగుతున్నాయని అన్నారు.ఆర్ఎఫ్‌సిఎల్ తమ ఆస్తులకు సంబంధించి రూ.18.00 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే ఈ నిధులను నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక జిఓ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆ నిధులను మళ్లించుకొని పోయిందని అన్నారు.ఇటీవల ఎన్‌టిపిసి సంస్థ క్వార్టర్ లకు కూడా స్టాంప్ డ్యూటి రూ 20 కోట్లు చెలిస్తే మన ఎం ఎల్ ఎ చొరవతో నగర పాలక పాలక సంస్థ ఖాతాలో జమ అయ్యాయని అన్నారు.కాగా గతంలో పోల్స్ వేసి వైర్ లాగ కుండా బిల్లులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నత స్థాయి అధికారులతో ఒక కమిటీ వేసి విచారణ జరిపి ఆ నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కాలుష్యంతో బాధపడుతున్న వీర్లపల్లి గ్రామస్తుల కోసం ఎంఎల్ఏ సహకారంతో మొదటగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా 31 అంశాలు ప్రవేశ పెట్టగా నెలవారీ నీటి ఛార్జీలు పెంచాలనే 20వ అంశాన్ని ముందుగానే ప్రక్కకు పెట్టి వాయిదా వేశారు.మిగిలిన అన్ని అంశాలను ఆమోదించారు.సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ కమిషనర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె.అరుణశ్రీ, వివిధ శాఖల, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

# మానవ మృగానికి జీవితకాల జైలుశిక్ష

◆ఆరేళ్ల బాలికపై అత్యాచారం హత్య కేసులో రాష్ట్రంలోనే సంచలన తీర్పు

◆ఈ తీర్పుతో కనువిప్పు కలగాలి

◆ నేరం చేయడానికి భయపడాలి!

◆ రూ.28 వేల జరిమానా. తల్లిదండ్రులకు రూ.3 లక్షల పరిహారం అందజేయాలని తీర్పు

◆ పకడ్బందీ దర్యాప్తు చేసిన ఏసీపీ గజ్జి కృష్ణకు న్యాయమూర్తి ప్రత్యేక అభినందనలు

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** సభ్య సమాజం తల దించుకునేలా ఆరేళ్ల బాలికను, కిడ్నాప్, అత్యాచారం, చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి జీవితాంతం జైలు శిక్ష తీర్పు సంచలనం సృష్టించింది.శుక్రవారం డిసిపి భూక్య రామ్ రెడ్డి, సుల్తానాబాద్ పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మండలంలోని, కాట్నపల్లి మమతా రైస్‌మిల్లులో ఆరేళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడికి పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జీవితాంతం (చనిపోయే వరకు) కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడు బీహార్ రాష్ట్రానికి చెందిన వినోద్ మాజి (28). న్యాయమూర్తి కె. స్వప్నరాణి నిందితుడికి రూ.28 వేల జరిమానా విధించడంతోపాటు, మృతిచెందిన బాలిక తల్లిదండ్రులకు రూ.3 లక్షల పరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు.

**- రైస్‌మిల్లులో దారుణం!!!**

ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన బాలిక తల్లిదండ్రులు కుటుంబంతో కలిసి ఉపాధి కోసం 2024 జూన్ 2న కాట్నపల్లిలోని మమతా రైస్‌మిల్లుకు వచ్చారు. మిల్లు యాజమాన్యం కేటాయించిన గదిలో ఉంటూ కూలి పనులు చేసేవారు. జూన్ 13 రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కుటుంబ సభ్యులు గది ముందు వరండాలో నిద్రించారు. అదే సమయంలో నిందితుడు వినోద్ మాజి అక్కడికి వచ్చి నిద్రిస్తున్న ఆరేళ్ల బాలికను ఎత్తుకెళ్లి రైస్‌మిల్లు వెనుక వైపు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేసి, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**- సీసీటీవీ,సాంకేతిక ఆధునాతన ఆధారాలతో ఛేదన**

రాత్రి బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, ఇతర కూలీలు చుట్టుపక్కల గాలించారు. జూన్ 14 ఉదయం రైస్‌మిల్లు వెనుక బాలిక మృతదేహం లభ్యమైంది. ఫిర్యాదుపై అప్పటి సుల్తానాబాద్ ఎస్ఐ సీహెచ్. శ్రవణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తును ఏసీపీ గజ్జి కృష్ణ చేపట్టారు.ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు సేకరించి, సాక్షులను విచారించి నిందితుడిని గుర్తించారు. నేరం జరిగిన మరుసటి రోజే, జూన్ 14 రాత్రి సుమారు 9.50 గంటలకు సుల్తానాబాద్ బస్టాండ్ నుంచి బీహార్‌కు పారిపోతుండగా వినోద్ మాజిని పోలీసులు పట్టుకున్నారు. నేర సమయంలో అతడు ధరించిన ప్యాంటును కూడా స్వాధీనం చేసుకున్నారు.

**30 రోజుల్లోనే చార్జిషీట్!!!**

దర్యాప్తును వేగంగా పూర్తిచేసిన ఏసీపీ గజ్జి కృష్ణ కేవలం 30 రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ అందించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో అతనికి జీవితాంతం కఠిన కారాగార శిక్షతోపాటు రూ.28 వేల జరిమానా విధించింది.

**- ఏసీపీ గజ్జి కృష్ణకు న్యాయమూర్తి అభినందనలు!!!**

కేసులో పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి, కీలకమైన భౌతిక, సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏసీపీ గజ్జి కృష్ణను న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

**- పోలీసు అధికారులకు సీపీ ప్రశంసలు :**

పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి పర్యవేక్షణలో, ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు, కోర్టు విచారణలో పోలీసులు సమన్వయంతో పనిచేశారు. సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, సుల్తానాబాద్ ఎస్ఐ పి. చంద్రకుమార్, కోర్టు కానిస్టేబుల్, లైజన్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది కేసు విచారణలో సహకరించారు. వారి సేవలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## సీనియర్ జర్నలిస్టు టీకే రమేష్ కు పోలీసుల ఘన నివాళి

**- పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మౌనం పాటించి సంతాపం తెలిపిన పోలీసు సిబ్బంది,విలేకరులు**



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** ఆత్మీయ మిత్రుడు, సోదరుడు, సుల్తానాబాద్ టీవీ9, సిటీ కేబుల్ సీనియర్ జర్నలిస్టు టికె రమేష్ బుధవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన మృతికి సంతాపంగా శుక్రవారం పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంక్కెన రవి,ఏసిపి గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐలు రంజిత్ రావు, ప్రవీణ్ కుమార్, ఎస్సైలు చంద్రకుమార్, అశోక్ రెడ్డి పోలీసు సిబ్బంది, మండల విలేకరులు మౌనం పాటించి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా రమేశ్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న పలువురు ఆయన మృతి జర్నలిజం రంగానికి,కుటుంబ సభ్యులకు, మిత్రులకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో రమేష్ అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుతూ పోలీసు సిబ్బంది,విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

## సందేశాత్మక చిత్రాలే సమాజానికవసరం..

**- 'తిరగబడ్డ మమకారం'లఘు చిత్రం ప్రివ్యూ..- పలువురు ప్రశంస..**

**గోదావరిఖని, జనంసాక్షి :** కళాకారుడు చంద్రపాల్ స్వీయ నిర్మాణ, దర్శకత్వంలో ఇటీవల షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైన 'తిరగబడ్డ మమకారం' లఘు చిత్రం ప్రివ్యూ శుక్రవారం స్థానిక చంద్రశేఖనగర్ లోని నిరీక్షణ స్టూడియోలో పుర ప్రముఖుల కొరకు ప్రదర్శించారు. ముందుగా చిత్ర దర్శకుడు చంద్రపాల్ మాట్లాడుతూ ఏ చిత్రమైన వారికి అద్భుతంగా ఉంటుందని, కానీ దానిలోని లోపాలను, సమాజంపై దాని ప్రభావాన్ని నిర్ణయించేది ప్రేక్షకులేనని, అందుకే సమాజహితంకోరే ప్రముఖులకు ముందుగా చూపించి, ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలనే వ్యక్తిగత సెన్సార్ ను పాటిస్తూ..ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్ర వీక్షణ అనంతరం అతిథులు మాట్లాడుతూ నేటి వాస్తవ సామాజిక పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకొని రూపొందించిన 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం సమాజానికి కొత్త సందేశం ఇచ్చే విదంగా ఉందని ప్రశంసించారు.ఈ చిత్రం ద్వారా ఒకరిద్దరిలో మార్పు వచ్చినా ప్రయోజనం సిద్ధించినట్లేనని అభిప్రాయం వ్యక్తం చేసారు.యూట్యూబర్స్ సామాజిక బాధ్యతగా సందేశాత్మక లఘు చిత్రాలు నిర్మించాలని సూచించారు.చిత్ర దర్శకుడు చంద్రపాల్,నటీనటులు మేజిక్ రాజా,పోతు శంకరయ్య, అంజిబాబు,సిరిపురం శ్రీనివాస్, రజిత, సతీష్, శ్రీలతకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇప్టా జాతీయ సమితి సభ్యులు కవ్వంపల్లి స్వామి, సీనియర్ పాత్రికేయులు దయానంద్ గాంధీ, విశ్రాంత ప్రభుత్వ అధికారి వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది వేల్పుల మురళీధర్ యాదవ్, మేజిక్ హరి, అశోక్ వేముల తదితరులు పాల్గొన్నారు.



## కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికిఘన నివాళులు



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :** సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసంఘ్ ప్రముఖ నాయకులు, తాత్వికవేత్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951లో భారతీయ జనసంఘ్ ఏర్పడిన అనంతరం ఆయన సంస్థాగత నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. 1953 నుంచి 1968 వరకు జనసంఘ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారు. 1967లో జనసంఘ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారని,దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రధాన ఆలోచనా వారసత్వంలో "ఏకాత్మ మానవతావాదం" ముఖ్యమైనది. వ్యక్తి, సమాజం, ప్రకృతి మధ్య సమన్వయాన్ని ఆయన ప్రతిపాదించారు. 1965లో ముంబైలో వరుసగా నాలుగు ఉపన్యాసాల ద్వారా ఈ సిద్ధాంతాన్ని విస్తృతంగా వివరించారని తెలిపారు.సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతిని కేంద్రంగా చేసుకుని "అంత్యోదయ" భావనను ఆయన ముందుకు తీసుకువచ్చారు. అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాల వరకు చేరాలని ఆయన ఆలోచనలు ప్రతిపాదించారని, ఆయన ఆలోచనలు, రచనలు సంస్థాగత సేవలు భారతీయ జనసంఘ్, తదనంతరం బీజేపీ ఆలోచనా ప్రస్థానంలో ముఖ్యమైన వారసత్వంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు,పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బందారి లత, మండల ప్రధానకార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, యువమోర్చ అధ్యక్షులు కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్క భాగ్యలక్ష్మి,ఎర్రం సంతోష్ రెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే నిమజ్జన వేడుకలు ప్రశాంతం

**- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న క్షేత్రంలో వినాయక నిమజ్జన మహోత్సవం అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణం లో ముగిసిందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. శోభాయాత్ర నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి చిన్నపాటి లోటుపాట్లు తలెత్తకుండా వేడుకలను దిగ్విజయం చేసిన పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆలయ అధికారులకు, సిబ్బందికి ఆయన శుక్రవారం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భం గా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక మార్గదర్శకత్వంతో పాటు, జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేలు అందించిన నిరంతర సహకారం, సమర్థవంతమైన పర్యవేక్షణ వల్లే వేడుకలు ప్రశాంతంగా పూర్తయ్యాయని కొనియాడారు.

ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ముందస్తుగా సమీక్షలు నిర్వహించి క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యలు ఎంతో తోడ్పడ్డాయని పేర్కొన్నారు. గుడి చెరువు, మానేరు తీర ప్రాంతాల వద్ద భక్తులకు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, రక్షణ బారికేడ్లు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. శోభాయాత్ర మార్గాల్లో శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా రాత్రింబవళ్లు శ్రమించిన పోలీస్ యంత్రాంగానికి, ఆలయ సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వినాయక నిమజ్జన వేడుకల విశేషాలను, భక్తుల సందడిని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, నిమజ్జన మహోత్సవ విజయవంతంలో కీలక పాత్ర పోషించిన ఎలక్ట్రానిక్ , ప్రింట్ మీడియా మిత్రులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆధ్యాత్మిక ఉత్సవాన్ని దిగ్విజయం చేసినందుకు ప్రతి ఒక్కరికీ మున్సిపల్ పాలకవర్గం తరపున అభినందనలు తెలియజేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కార్మికులకు కొరత రాకుండా పటిష్ట చర్యలు

## అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కార్మికులకు కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్ల పై హమాలీ సంఘాల ప్రతినిధులు, లారీ ఓనర్ల యాజమాన్యంతో సంబంధిత అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో హమాలీల సమస్య తలెత్తకుండా ముందస్తుగా హమాలీలను సమకూర్చుకోవాలని, స్థానికంగా హమాలీలా కొరత ఉంటే ప్రత్యామ్నాయంగా బీహార్ కార్మికులను అందుబాటులో ఉంచు కోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్ తప్ప నిసరిగా ఉండాలని, ఓవర్‌లోడ్‌ను ఎట్టి పరిస్థితు ల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ఈసారి కొనుగోలు ప్రక్రియలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నందున, క్షేత్రస్థాయిలో తాజా ఫొటోలు, వివరాలను మాత్రమే నమోదు చేయాలని, జిల్లాలో ధాన్యం నిల్వకు గోదాము స్థలాన్ని ముందుగానే గుర్తించాలన్నారు. అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నందున, ఆ నాటికి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లుల మ్యాపింగ్, రవాణా, గోదాముల గుర్తింపు తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, లారీ ఓనర్ల యాజమాన్యం, హమాలీ సంఘాల ప్రతినిధులు, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డే

**పిట్లం సెప్టెంబర్ 25(జనం సాక్షి)**
పిట్లం మండల కేంద్రంలోని ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఫార్మాసిస్టులో శ్రీనివాస్, కల్పన, సవిత,ఘనంగా సన్మానించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ప్రమోద్ మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వైద్యులు సూచించిన మందులను రోగులకు సక్రమంగా అందిస్తూ ఆరోగ్య సేవలో వారు ముఖ్యమైన బాధ్యతను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా వారి సేవలను గుర్తించి సన్మానించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ నారాయణ, కార్యదర్శి మారుతి రెడ్డి, కోశాధికారి బాలు, నారాయణరెడ్డి, కిషన్, చంద్రశేఖర్, కాశిరెడ్డి, అశోక్ గౌడ్, వైద్యులు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారం తీసుకోవాలి: డాక్టర్ ఉమాకాంత్



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
గర్భిణీ స్త్రీలు కచ్చితంగా పౌష్టిక ఆహారం తీసుకోవాలని వైద్యుడు ఉమాకాంత్ సూచించారు. శుక్రవారం పెద్ద కొడప్గల్ ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని, నిత్యం కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి బలరాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన చికిత్సను అందించాలని వైద్యునికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఉమాకాంత్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేసిన తహశీల్దార్

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ రాజశేఖర్ మండల నాయకులతో కలిసి కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 కళ్యాణలక్ష్మి, 2 షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఓ రాములు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్, పాండు నాయక్, తదితరులు ఉన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ ,హక్కులపై

# విస్తృత అవగాహన కల్పించాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**- అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సందర్భంగా వారోత్సవాల ఎల్డర్ గైడ్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :**
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా,జిల్లాలోని వయోవృద్ధుల సంక్షేమం,సంరక్షణ,వారి హక్కులకు సంబంధించిన పోస్టర్లు, "ఎల్డర్ గైడ్ పోస్టర్లను లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వయోవృద్ధుల సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.వృద్ధుల హక్కుల పరిరక్షణకు సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ సమన్వయంతో కృషి చేయాలని, వృద్ధులకు అవసరమైన సేవలు,ప్రభుత్వ పథకాలు,సంక్షేమ కార్యక్రమాలను అందరికీ చేరవేసేలా ఈ 'ఎల్డర్ గైడ్' ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ రాజయ్య,పెద్దపల్లి టాస్క్ అధికారి కౌసల్య,ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్ జీవన్ రాజు,సుల్తానాబాద్ ఓల్డ్ ఏజ్ హోం అధ్యక్షులు సతీష్ ఆఫీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ 2026లో భాగంగా గిద్ద చెరవు శుభ్రత

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 25, (జనంసాక్షి) :**
స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమంలో భాగంగా వినాయక నిమజ్జన స్థలమైన గిద్ద చెరువులో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనం అనంతరం చెరువు పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ పూలు, ప్లాస్టిక్ వస్తువులను వేర్వేరుగా సేకరించి కంపోస్టింగ్‌కు తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి సరైన విధంగా నిర్వహించడం ద్వారా స్వచ్ఛతను ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనగందుల నరసింహులు, ఉపసర్పంచ్ బంధారపు బాల్‌రెడ్డి, ఈఓ కృష్ణ, వార్డు సభ్యులు అంగూరి ప్రవీణ్‌కుమార్, అంతర్పుల గోపాల్‌తో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.






# యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణే ధ్యేయం

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- స్థానిక యువత కోసం లోకల్ జాబ్స్ పాటు వర్క్ ఫ్రమ్ హోమ్**

**- ఉద్యోగ అవకాశాలపై టాస్క్, డీట్, వివిధ సంస్థల ప్రతినిధులతో సమీక్ష**

**పెద్దపల్లి,సెప్టెంబర్ 25(జనంసాక్షి) :**
జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలో ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్, ఇండస్ట్రీ, ఎంగేజ్‌మెంట్" అంశంపై వివిధ కంపెనీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక సమీక్షా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, స్థానిక ఉపాధి ఉద్యోగాలు, అర్హతలు, శిక్షణ, జీతం శ్రేణి, ఆశించిన ఉద్యోగాల గురించి చర్చించారు.విద్యార్థులకు డేటా అనలిస్ట్ ప్లేస్‌మెంట్, శిక్షణ నిరుద్యోగులకు అందించాలని,ఉద్యోగ అవకాశాలు,జీతం, భవిష్యత్ అవకాశాలు,విద్యార్థుల అప్‌స్కిల్లింగ్ అవసరాలపై శిక్షణ పెంపొందించేలా నిరుద్యోగులకు ప్రత్యేక చొరవ కలిగి ఉండేలా టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణను అందించాలని తెలిపారు.పదవ తరగతి,ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సైతం ఉపాధి కల్పించేలా బ్యాంకింగ్ బేసిక్ లెవెల్స్, హెల్త్ కేర్ అసిస్టెంట్, పేషెంట్ కేర్ జాబ్స్, ప్రొడక్ట్ డిజైన్, రిటైల్ మార్కెట్లో సేల్స్ వంటి రంగాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని తెలిపారు.బాలికలు,మహిళల కోసం ప్రత్యేక గర్ల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, ప్రమోషన్స్ కల్పించేలా 30 రోజుల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని ఆదేశించారు.నియామక డ్రైవ్ నిర్వహించే సాధ్యసాధ్యాలపై చర్చించారు. అవగాహన కార్యక్రమం నిర్వహించి తగిన సంఖ్యలో యువత సిద్ధమయ్యాక డ్రైవ్ నిర్వహించాలని, సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.టాస్క్ ఇంటర్ ద్వారా ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించే అవకాశంపై చర్చించి, అవసరమైన బ్యాచ్, విద్యార్థుల ప్రొఫైల్, అర్హత, ఉపాధి అవకాశాలు,ఏర్పాటు,ఆసక్తిగల స్టార్టప్‌ల గురించి పలు సూచనలు చేశారు.స్థానిక యువతకు వర్క్-ఫ్రమ్-హోమ్ ఉపాధి అవకాశాలు, సోలార్, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే అవకాశంపై ,ఐటీ,సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు, బేసిక్-టు-మోడరేట్ స్థాయి ఐటీ,ఉపాధి అవకాశాలపై సమీక్షించారు.అనంతరం పెద్దపల్లి టాస్క్ సెంటర్లో శిక్షణ పొంది ఐసిఐసిఐ బ్యాంక్ లో సీనియర్ ఆఫీసర్ గ్రేడ్‌లో 'రిలేషన్‌షిప్ మేనేజర్' ఉద్యోగం సాధించిన ముస్త్యాల మణిశ్రీ ని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, రీజినల్ టాస్క్ సెంటర్ (ఇంచార్జ్) కౌసల్య,వివిధ కంపెనీల ప్రతినిధులు శ్యామ్, హరిహర్, వంశీ,అర్జున్,సంబంధిత,అధికారులు పాల్గొన్నారు.

# సహకార సంఘ సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత

**○ మాజీ సెక్రటరీ మామిడాల అశోక్ కుమార్ మృతికి సంతాపం ○సర్వ సభ్య సమావేశంలో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**మంథని, సెప్టెంబర్ 25, ( జనంసాక్షి ) :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,మంథని కార్యాలయంలో 89 సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘ సభ్యులు, రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి వివిధ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన సహకారం అందిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహకార సంఘం అభివృద్ధి చెందితే సభ్యులు, రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని, అందుకు పాలకవర్గం, సిబ్బంది, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంఘం ద్వారా గత రబీ సీజన్ లో ఎక్కడ లేని విధంగా అత్యధికంగా 36 కేంద్రాలు నిర్వహించి 5,05,585 క్వింటాల్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో, రాష్ట్రంలో ప్రథమ స్థానం లో నిలిచామని అన్నారు. అంతే కాకుండా ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్, సహకార అధికారి సహకారం తో గుంజపడుగు శివారు లో రూ.3.40 కోట్లతో పిఎం కుసుమ్ ద్వారా సౌర విద్యుత్ ను ప్రోత్సహించేందుకు సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. తద్వారా సంఘానికి రూ.51 లక్షల ఆదాయం సమకూరనుందని అన్నారు. ఈ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గోనె సంచుల సమస్య రాకుండా తగు చర్యలు చేపడుతున్నామని, ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లల కు తరించేలా తగు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పూర్తి జవాబుదారి తనంగా వ్యవహరిస్తామని, రైతుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపడుతామని అన్నారు. గత సీజన్ లో జరిగిన ఇబ్బందులు మళ్ళి పునరావుతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో రైతుల కు ధాన్యం లో ఎలాంటి కోతలు లేకుండా కొనుగోళు ్ళ చేపడుతున్నామని అన్నారు. టీజీఈఆర్సి సలహాదారు శశి భూషణ్ కాచే మాట్లాడుతూ స్వాతంత్ర్య, సహకార ఉద్యమ కాలంలో కొంత మంది వ్యక్తులు తమ ఆస్తులు, డబ్బులు దారాదత్తం చేసి సంస్తలను కాపాడుకున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలో మెట్ పల్లి, వావిలాల చేనేత సహకార సంఘాలు కాల గమనం లో నిర్వహణ లోపాల మూలంగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి వారు చేపట్టిన రుణ మాఫి లాంటి సంస్క రణ ల వల్ల రైతుల రుణాలు మాఫీ అయ్యా యని, సకాలం లో రుణాలు చెల్లించిన వారికి రూ.5 వేల ఇన్సెంటివ్ అందిచారని గుర్తు చేశారు. తద్వారా రైతులకు ఆర్థిక భరోసా అందటం తో పాటు సంఘాలు ఆర్థికంగా నిలదొక్కు గలిగాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య సంఘ జమ ఖర్చులు పట్టిక చదివి వినిపించారు. అలాగే సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సమాధానాలు ఇచ్చారు. ముందుగా సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ అకాల మృతి కి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిముర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి-మొండయ్య, ఉడుత మాధవి ? పర్వతాల్ యాదవ్, దేవల్ల విజయ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, సర్పంచులు తోటపల్లి పోచయ్య, సంగెం సరోజన- గట్టయ్య, న్యాతరి లతా-శ్రీనివాస్, గుమ్మడి సమ్మయ్య, సంధ్య-భానేష్, జాడి రామ స్వామి, మాజీ ఎంపిపి కొండ శంకర్, సంఘ మాజీ డైరెక్టర్ ఇనుముల సతీష్, నాయకులు బెజ్జంకి డిగంబర్, వేల్పుల గట్టయ్య, తిరుపతి, సబ్బని సంతోష్, పెద్ద సంఖ్యలో సభ్యులు, రైతులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## క్యాషియో జాతీయస్థాయి మ్యూజిక్ పోటీల్లో పారమిత విద్యార్థికి మూడవ స్థానం..

**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** క్యాషియో,మాస్టర్ మ్యూజిక్ ఆధ్వర్యంలో ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సంగీత పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి కె.చరణ్ మూడవ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కె.హన్మంతరావు తెలిపారు.జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డు సాధించిన విద్యార్థి కె.చరణ్‌ను,సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పారమిత పాఠశాలలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి,వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం.ప్రసాద్,వినోద్‌రావు తదితరులు విద్యార్థి కె.చరణ్‌ను,సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, భవానీ,నిఖిత,సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మ తదితరులు పాల్గొన్నారు.



## కోర్కల్ లో వినాయక నిమజ్జన డిజే వివాదంలో ఘర్షణ: 8 మందిపై కేసు నమోదు, బైండోవర్

వీణవంక సెప్టెంబర్ 25 (జనం సాక్షి)
వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామంలో వినాయక నిమజ్జనం రోజున,మరుసటి రోజున డిజే సౌండ్ సిస్టమ్ విషయమై రెండు వర్గాల ఖీ1-ఖీ4,ఖీ5-ఖీ8 మధ్యగొడవ జరిగి పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో పోలీసులు 8 మందిపై కేసు నమోదు
చేశారు.సమాజంలోశాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు గాను సదరు వ్యక్తులను శుక్రవారం రోజున అరెస్ట్ చేసి,తాసిల్దార్ కార్యాలయంలో హాజరుపరిచిఇట్టి వ్యక్తులు బైండోవర్ చేయడం జరిగింది.
కేసు నమోదు కాబడినవ్యక్తుల వివరాలు మొదటి వర్గం గ్రూప్
1.రవాణవేణి సాగర్,2.కొలిపాక
రాకేష్,3.కొలిపాక కుమార్,
4.రవాణవేణి సదయ్య,
రెండవ వర్గం
5.అంబాల రాజ్‌కుమార్,
6.ఎల్కపల్లి రాహుల్,
7.పూసల కుమార్,
8.ఎల్కపల్లి రాజు కోర్కల్ గ్రామానికి చెందిన వారు.
గ్రామంలోఎలాంటి అశాంతి వాతావరణం సృష్టించినా,చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ ఆవుల తిరుపతి హెచ్చరించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా 110వ పండిత్ దీన్ దయల్ జయంతి వేడుకలు

**కథలపూర్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి)**
కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో శుక్రవారం రోజున బీజేపీ ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, ఏకాత్మ మానవ వాదం,అంత్యోదయ సిద్ధాంత కర్త పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు గాంధారి శ్రీనివాస్ మాట్లాడుతూ.ఆయన జయంతినీ కేంద్రం అంత్యోదయ దివస్ గా జరుపుతుందన్నారు. విదేశీ దృక్పథం తో కాకుండా స్వదేశీ ఆలోచనతో దేశానికి దిశా నిర్దేశం చేశారన్నారు.పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశ సేవకు అంకితమైన మహనీయుడని, సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంత్యోదయ భావనను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఆయన సిద్ధాంతాలు, ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని, సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు అందించాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాసోజి ప్రశాంత్,గాంధారి శ్రీనివాస్,కాసోజి ప్రతాప్, గొడికె లింగేశ్వర్, చింతకుంట రవి,ద్యావల్ల రాజు, మారుతి,దొమ్మటి రాజు,ఎల్ల వినోద్,నవీన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





## మత సామరస్యంతోనే దేశాభివృద్ధి

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 25, ( జనం సాక్షి)**
హిందూ, ముస్లిం, సిక్కు తదితర అన్ని మతాల ప్రజలు మత సామరస్యంతో కలిసిమెలిసి జీవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మించిన మాసాన్ని పురస్కరించుకుని జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో కరీంనగర్ మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించేందుకు ఆర్థిక సహాయం చేయాలని నిర్వాహకులు కోరగా.. గంగుల కమలాకర్ వెంటనే స్పందించి రూ.60 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్నేహభావంతో, పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు యూసుఫ్, అలీ, నాయకులు గాదె శ్రీనివాస్, జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుండారంలో ఉచిత ఎక్స్ రే వైద్య శిబిరం

**కమాన్ పూర్ సెప్టెంబర్ 25, (జనంసాక్షి) :**
అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఉచిత ఎక్స్ రే వైద్య పరీక్షలు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గుండారం గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీలో కమాన్ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఎక్సరే పరీక్షల క్యాంపును సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ మస్కం సంగీత, మంద రాజేశ్వరి, రామిడి పురుషోత్తం, కర్రి ఆవుల ఇందిరా, ఆశ వర్కర్లు దండే శారద దండ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# జనరిక్ ఔషధ కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి

**చొప్పదండి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ ఔషధ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రంలో సేవలందిస్తున్న ఫార్మసిస్టులు నాంపల్లి మమత, కస్తూరి కావ్య, అసిస్టెంట్ కళ్ళెం హర్షవర్ధన్ రెడ్డిలను సంఘ అధ్యక్షులు (చైర్మన్) ఇప్ప శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. చొప్పదండి ఖంఅూ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రంలో ప్రైవేట్ మెడికల్ షాపులతో పోలిస్తే దాదాపు 80% వరకు రాయితీతో నాణ్యమైన జనరిక్ మందులు లభిస్తున్నాయని తెలిపారు. సంఘం ఎటువంటి లాభాపేక్ష లేకుండా, కేవలం స్థానిక ప్రజలకు, పేద, మధ్యతరగతి వర్గాలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఔషధాలు అందించాలనే సంకల్పంతోనే ఈ కేంద్రాన్ని నడుపుతున్నామని స్పష్టం చేశారు.



చొప్పదండి మండల ప్రజలు, రైతులు, పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ కేంద్రాన్ని సందర్శించి నాణ్యమైన మందులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు నిజానపురం చందు, ముఖ్య నాయకులు పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి గౌడ్, వడ్లూరి శ్రీనివాస్, సంఘ కార్యదర్శి (సీఈఓ) కళ్ళెం తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు

**మల్యాల సెప్టెంబర్ 25 (జనంసాక్షి)**

మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినిలు కోరుట్లలలో జరిగిన జిల్లా అథ్లెటిక్ పోటీలలో జి.హారిక(9వ తరగతి) అండర్ 16 లో 600 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, ఆర్.మనీషా (ఇంటర్ సెకండ్ ఇయర్) 1000 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి సెప్టెంబర్ 26,27 వ తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస,పి.ఈ.టి,మధులిక ప్రకటనలో తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా ఎన్ఎస్ఎస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు..

### ఎన్ఎస్ఎస్ పూర్వ వాలంటీర్లకు ఘన సన్మానం...



**చిగురుమామిడి సెప్టెంబర్ 25(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ 2005ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎన్ఐసి పూర్వ వాలంటీర్ చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన పత్తేం శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ 50ఇయర్స్ గోల్డెన్ జూబ్లీ వారోత్సవాలను వైభవంగా నిర్వహించిన సందర్భంగా ఈ వేడుకల్లో భాగంగా మాజీ వాలంటీర్లు, యూత్ అవార్డు గ్రహీతలు, నేషనల్ అవార్డీలు,అలాగే ఎన్ఎస్ఎస్ ఎన్ఐసి పలు క్యాంపుల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపైకి చేరారు. 50సంవత్సరాల ఈ మైలురాయిని పురస్కరించుకుని విద్యార్థులు చేసిన సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్,కేయూ వైస్ ఛాన్సర్ కె ప్రతాప్ రెడ్డి, ప్రొఫెసర్ వి రామచంద్ర,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ కలిసి ఈ ఎన్ఎస్ఎస్ డేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు కిష్టయ్య,తాళ్లపల్లి మనోహర్,సురేష్ లాల్,రమణ, ఆర్ ప్రవీణ్ కుమార్,సత్యనారాయణ యాదగిరి,ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీ,జ్యోతి,ఎన్ఎస్ఎస్ అవార్డీలు కొండ రవి,కళింగ శేఖర్,ఏ కిరణ్,అలువాల విష్ణు,రవి ప్రసాద్,మధు,ఎన్ఐసి పత్తేం శ్రీనివాస్,మాజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్, జబర్దస్త్ కమెడియన్ జీవన్,జబర్దస్త్ రాజమౌళి, వడ్లకొండ అనిల్,బుర్ర సతీష్,నాగరాజు,మధు, ప్రవీణ్,అశోక్, శ్రీనివాస్, ఓరుగంటిశేఖర్, పెద్ద సంఖ్యలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## మైనారిటీ గురుకుల పాఠశాలలో 38 విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

**జమ్మికుంట, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు మాసాల క్రితం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్ బి ఎస్ కె) వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలున్న 38 మంది విద్యార్థులను గుర్తించగా వారికి కళ్లద్దాలు శుక్రవారం రోజున ఆర్ బి ఎస్ కే వైద్య బృందం హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. మంచి పోషకాలతో నిండిన సమతుల్య ఆహారం తీసుకోవాలని,

తగినంత నిద్ర పోవాలని,వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మొబైల్ ఫోన్ కు దూరంగా ఉండాలని ఎవరికైనా కంటిలో డబుల్ దృష్టి, మబ్బుగా ఉన్న దృశ్యం,ఎరుపు కళ్ళు,కాంతి వెలుగులు, కళ్ళు లేదా కనురెప్పల వాపు వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటిని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె వైద్యాధికారి డాక్టర్ మొగిలి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం,డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని,ఫార్మసిస్ట్ పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

## దుబాయిలో నవరత్రి ఉత్సవాలు నిర్వహించిన కథలాపూర్ మండల యువకులు



**కథలాపూర్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి )**

తెలంగాణ ప్రాంతంలోని జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలలోని యువకులందరూ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్ళగా అక్కడ వారు తెలంగాణ సంస్కృతిని భారతీయ సంస్కృతిని నిలిపే విధంగా వినాయక నవరాత్రి ఉత్సవాల పురస్కరించుకొని వినాయక చతుర్థి మరియు వినాయక నిమర్జనం మన హిందూ సాంప్రదాయల ప్రకారం చేయడం జరిగింది. ప్రతిరోజు ఉదయం సాయంకాలం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం చేయడం జరిగింది. దుబాయి కీ ఉపాధి నిమిత్తం వెళ్లగా అక్కడ నవరాత్రి ఉత్సవాలు చేయడం చాలా సంతోషకరమని పలువురు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పుల్ల రాజు గౌడ్, కార్తీక్,సాగర్ గౌడ్,పవన్ గౌడ్, శేఖర్,తదితరులు ఉన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ గా నిమ్మటూరి సాయికృష్ణ

### అధికారికంగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం



**హుజురాబాద్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** హుజురాబాద్ వీర నారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ గాహుజురాబాద్ పట్టణానికి చెందిన నిమ్మటూరి సాయికృష్ణ చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ గా నియామకం. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి అధికారిక ఉత్సవ కమిటీలో మొత్తం 30 మంది కన్వీనర్లకు ప్రభుత్వం స్థానం కల్పించింది. ఈ కమిటీలో నిమ్మటూరి సాయి కృష్ణకు స్థానం కల్పించడంపై పట్టణానికి చెందిన ప్రముఖులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి ఉత్సవాలను ఈనెల 26 న హైదరాబాదులోని రవీంద్ర భారతి లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. తననియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ఉత్సవ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, లకు కృతజ్ఞతలు తెలిపారు. సాయికృష్ణ నియామకం పట్ల హుజురాబాద్ రజక సంఘం పట్టణ అధ్యక్షుడు కొండపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, సీనియర్ రజక సంఘం నాయకులు కొలిపాక సారయ్య, కొలిపాక పోచయ్య. కొలిపాక శంకర్, బోరింగ్ వెంకటరజం, గోపు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బిజెపి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

# రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

### - సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు



కమాన్ పూర్ సెప్టెంబర్ 25, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు ఎఫ్ బి ఓ షేర్లు తీసుకోవాలని పాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో షేర్లు తీసుకున్న రైతులకు సర్టిఫికెట్లను పాలకవర్గం ఆధ్వర్యంలో ఎఫ్.పి.ఓ వాటాదారులకు షేర్ సర్ కమాన్ పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ బి ఓ) లో సభ్యత్వాలు పొంది, వాటా ధనం చెల్లించిన రైతులకు గురువారం షేర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఐ.సి చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు , వైస్ చైర్మన్ తిందం తిరుపతి, డైరెక్టర్లు గుండేటి శ్రీమూర్తి , అడ్వాల చంద్రయ్య , వారాల నర్సింగం , బానోతు లక్ష్మి , చేతుల మీదుగా సభ్యులకు అధికారికంగా ఈ షేర్ సర్టిఫికెట్లను అందజేశారు. ?ఈ సందర్భంగా పి.ఐ.సి చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు మాట్లాడుతూ.. సహకార రంగం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఎఫ్.పి.ఓ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. రైతులు సమైక్యంగా ఏర్పడి విత్తనాలు, ఎరువుల కొనుగోలుతో పాటు పంట ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఎక్కువ లాభాలు సాధించవచ్చని సూచించారు. ?ఎఫ్.పి.ఓలో భాగస్వాములైన రైతులకు సొసైటీ ద్వారా అందించే అన్ని రకాల సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటాయని, మిగతా రైతులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఎఫ్.పి.ఓలో సభ్యులుగా చేరాలని కోరారు. అలాగే ఒక్కో షేరు 100 రూపాయలు ఉంటుందని ప్రతి రైతు కనీసం 20 షేర్లు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి తిమ్మరాజు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించని యెడల వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు అర్ధవార్షిక లెక్కలు చూడడం జరిగిందని పేర్కొన్నారు. స్వల్ప కాలిక రుణాల యొక్క వడ్డీ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ప్యాక్స్ సీఈవో తిమ్మరాజు సంతోష్ కుమార్, సిబ్బంది రవీందర్, కుమార్, సాబీర్, రైతు సోదరులు, వాటాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

## తపస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు

**గంగాధర సెప్టెంబర్25 (జనంసాక్షి):**
ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ పేరుతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై పెడుతున్న ఒత్తిడి తగ్గించాలనీ తపస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు.ప్రధానకార్యదర్శి జారతి నర్సయ్యలు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టులో భాగంగా విద్యార్థులలో నిర్దేశించిన కనీస సామర్థ్యాల సాధన కొరకు ఎఫ్ఎల్ఎన్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల లో తరగతి గదుల లేమి బహుళ తరగతుల బోధన అరకొర వసతులు ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడం తల్లి దండ్రుల సహకారం లేకపోయినప్పటికీ తరగతి గదిలో కనీస విద్యాసామర్థ్యాలు సాధనలో ఉపాధ్యాయులు నిరంతరం అంకితభావంతో విద్యార్థులలో నిర్దేశించిన సామర్థ్యాల సాధనలో శక్తి మేరకు కృషి చేస్తున్నామని అన్నారు అంతేకాకుండా కాంప్లెక్స్ సమావేశాలు, మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ,సిసిఈ రిజిస్టర్ల నిర్వహణ ఎఫ్ఆర్ఎస్ ఆన్లైన్ ఎంట్రీలు మొదలగు కార్య క్రమాల నిర్వహణతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న సందర్భంలో ఫ్రెండ్లీ అడ్వైజరి టీంల పేరుతో అధికారులు ఎఫ్ఎల్ఎన్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి టీం లీడర్ మరియు సభ్యులు అదే క్యాడర్ కలిగిన వారితో పర్యవేక్షణ పేరుతో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యా యులను ఒత్తిడికి గురిచేయడంపట్ల ఆందోళన వ్యక్తం చేశారు ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షక టీంలు పాఠ శాలలను సందర్శించిన సమయంలో ఉపాధ్యా యులను ఒత్తిడికి గురి చేయకుండా సామర్థ్యాల




సాధన సంబంధించిన సూచనలు బెస్ట్ ప్రాక్టీస్ తెలియపరిచినట్లయితే లోపాలను సరిదిద్దుకొని ప్రభుత్వం ఆశించిన కనీస సామర్థ్యాల సాధనలో ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తద్వారా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉపాధ్యాయులకు ప్రోత్సాహకంగా ఉంటుందని ఆ దిశగా పర్యవేక్షణ ఉండాలని కోరారు.



# ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయడంపై సమావేశం

**ముస్తాబాద్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి )**
ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల , గ్రామ శాఖ అధ్యక్షులతో సన్నాహక సమావేశం నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ కన్నమేని చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన సిరిసిల్లలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించడం జరిగింది.సిరిసిల్లలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసి, సిరిసిల్ల సిగలో మరో సిరి తెచ్చిన ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సభకు ముస్తాబాద్ మండలం నుండి ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరారుఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కొండం రాజు రెడ్డి, మాజీ సర్పంచులు జిల్లా కార్యవర్గ సభ్యులు సర్పంచులు, ఉప సర్పంచ్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు గ్రామ శాఖ అధ్యక్షులు పట్టణ శాఖ అధ్యక్షులు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల సందర్శించిన ఎంపీడీవో శంకర్

**కథలాపూర్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి )**
కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట గ్రామం లో శుక్రవారం రోజున ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో శంకర్ గ్రామ సర్పంచ్ బద్దం మహేందర్ మరియు జి.పి.ఓ,తో కలిసి సందర్శించి, పాఠశాల లోని విద్యార్థుల సంఖ్యను,ఉపాధ్యాయుల హాజరు,విద్యార్థులకు యూనిఫామ్ లు,మరియు షూస్ అన్ని సరైన క్రమం లో పాఠశాల కీ అందాయ అని పాలు విషయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడం జరిగింది, మరియు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, అందులో లోపాలు తెలుసుకుని,మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు పాలు సూచనలు ఇవ్వడం జరిగింది.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అంబారిపేట విద్యార్థిని ఎంపిక

**కథలాపూర్ సెప్టెంబర్ 24 (జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలోని అంబారిపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చెందిన అరికంటి లహర్ష పదవ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు, కోరుట్లలోని మినీ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో 60 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది ఈనెల 26 27 తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు హెచ్ ఎం కిసాన్ రావు మరియు పిడి రాజేష్ తెలిపారు, వీరిని ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు అభినందించారు.






# వీణవంక పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం

## బీజేపీ వీణవంక మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్

**వీణవంక సెప్టెంబర్ 25( జనంసాక్షి)**
వీణవంక పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను,ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాలను స్మరించుకుంటున్నామని భారతీయ జనతా పార్టీ వీణవంక మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ తెలిపారు.1916 సెప్టెంబర్ 25న జన్మించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశం,సమాజం పట్లఅంకితభావంతో పనిచేసిన గొప్ప చింతకుడు, తత్వవేత్త,రాజకీయ నాయకుడు అని పేర్కొన్నారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ప్రచారక్‌గా పనిచేస్తూ దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే అంత్యోదయ భావననుభారతీయ జనసంఘ్‌ను బలోపేతం చేయడంలోదీన్‌దయాళ్ ఉపాధ్యాయ పాత్ర చిరస్మరణీయమని,ఆయన ఆలోచనలు భారతీయ జనతా పార్టీకి సైద్ధాంతిక పునాదిగా నిలిచాయని బత్తిని నరేష్ గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహారాజు మాట్లాడుతూ దేశం కోసం జీవించాలి,సమాజంలోని ప్రతి ఒక్కరి అభ్యున్నతికి కృషి చేయాలి అనే ఆయన సందేశాన్ని ప్రతి కార్యకర్త ఆదర్శంగాతీసుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఘన నివాళులు అర్పిస్తూ,వారిఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు మండలం మాజీ అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి,ముత్యల రవీందర్,మండల ప్రధాన కార్యదర్శి కొమ్మడి శ్రీనివాస్ రెడ్డి,మండల కార్యదర్శి బొంగుని ఎల్లా గౌడ్,బొబ్బల శ్రీనివాస్ రెడ్డి,మారం తిరుపతి రెడ్డి,బూత్ అధ్యక్షులు మోటం శ్రీనివాస్,కంకాల సంతోష్,ముడికే కుమార్,దసారపు అశోక్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతికి ఘన నివాళి

**మల్యాల సెప్టెంబర్ 25 (జనంసాక్షి)**
మల్యాల మండల బిజెపి పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మల్లేశం మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేసి“ఏకాత్మ మానవతావాదం”, “అంత్యోదయ” సిద్ధాంతాలను సమాజానికి అందించారని కొనియాడారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేయడమే దీన్‌దయాళ్ నిజమైన నివాళి అని పేర్కొన్నారు.2047 నాటికి ఆత్మనిర్భర్,సమృద్ధ, సమర్థ,సంపన్న భారత్ నిర్మాణానికి ప్రతి బీజేపీ కార్యకర్త క్రమశిక్షణతో, నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటస్వామి యాదవ్,మాజీ ఎంపిటిసి రాచర్ల రమేష్,బీజేవైఎం మండల అధ్యక్షుడు పొనుగంటి గౌతం,నులుగొండ సురేష్, జనగం రాములు,నక్కా ఆనందం,బండారి రాజు,షేర్ల పరుశురాం,గుండేటి గంగారం,గోపాల్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డైరెక్టర్లు, జీఎంల ప్రత్యేక పూజలు

రామగిరి జనం సాక్షి (సెప్టెంబర్ 25):
రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శుక్రవారం డైరెక్టర్లు, జనరల్ మేనేజర్లు టి.ఆర్. కన్నన్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, సౌత్ సెంట్రల్ జోన్, హైదరాబాద్, డాక్టర్ నగేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, హైదరాబాద్ రీజియన్?2, డాక్టర్ ఐ. సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, హైదరాబాద్ రీజియన్?1, అశోక్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, హైదరాబాద్తో పాటు ఆర్జీ?1 జీఎం లలిత్ కుమార్, ఆర్జీ?2 జీఎం లక్ష్మీపతి గౌడ్, ఆర్జీ?3 జీఎం మధుసూదన్ లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఆలయానికి వచ్చిన అధికారులకు ఆలయ అర్చకులు రుద్రభట్ల జయంతి శర్మతో పాటు ఆలయ డైరెక్టర్లు, నిర్వాహకులు పూర్ణకుటుంబంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అధికారులు, జీఎంలను ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చిత్రపటాలను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, స్వామివారి ప్రాశస్త్యం గురించి అర్చకులు అధికారులకు వివరించారు. సుందిళ్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని, నిత్యం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు



నిర్వహిస్తుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ నరెడ్ల శ్రీనివాసరావు, రేణిగుంట రవి, మాటూరు సమ్మయ్య, ఓసీపీ?2 పీవో రాజశేఖర్, అధికారుల సంఘాల నాయకులు కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే హెచ్ఐవి నివారణ సాధ్యం

## జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం శ్రీనివాస్..



**రాయికల్ సెప్టెంబర్ 25 జనంసాక్షి:** అవగాహనతోనే హెచ్ఐవి వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో హెచ్ఐవి వ్యాధి పై కళాజాత బృందాల తో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ... హెచ్ఐవి ప్రధానంగా అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం, కలుషిత సూదులు/సిరంజీలు మరియు హెచ్ఐవి ఉన్న తల్లి నుంచి శిశువుకు సంక్రమించే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే సాధారణంగా కలిసి ఉండటం, చేతులు కలపడం, ఒకే ఆహారం తినడం, ఆలింగనం చేసుకోవడం, దోమల ద్వారా హెచ్ఐవి వ్యాప్తి చెందదని స్పష్టం చేశారు. హెచ్ఐవిపై అనుమానం ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు మరియు కౌన్సెలింగ్ పొందవచ్చని తెలిపారు. హెచ్ఐవి నిర్ధారణ అయిన వారు వైద్యుల సూచన మేరకు యాంటిరెట్రోవైరల్ థెరపీ (ఏ.ఆర్.టి )ను క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు.హెచ్ఐవి ఉన్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి సహకారం, గౌరవం అందించాలని వైద్య సిబ్బంది సూచించారు. ప్రజలు అపోహలను వీడి, హెచ్ఐవి సరైన సమాచారాన్ని తెలుసుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కస్తూరి సతీష్, సర్పంచి ఏంబారీ గౌతమి, ఉప సర్పంచ్ వినయ్, గ్రామ నాయకులు గ్రామ ప్రజలు గడ్డం రమేష్ కళాబృందం తదితరులున్నారు.



## కరీంనగర్ న్యాయవాదుల సహకార సొసైటీ కార్యాలయం ప్రారంభం

**కరీంనగర్ లీగల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో కరీంనగర్ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని జిల్లా జడ్జి శివకుమార్ శుక్రవారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మణ్, వైస్ చైర్మన్ చంద్రపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన జిల్లా జడ్జి శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ ఏర్పాటు పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ బొడ్ల గీతారాణి, ట్రెజరర్ సుంకె దేవకిషన్, డైరెక్టర్లు ఉపాధ్యాయుల కరుణశ్రీ, బండ శివకుమార్, మదన్‌బాబు, బొజ్జ స్వామి, మూఢపల్లి అనురాధ, బెజ్జంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేశం, సమాజం కోసం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవవాదం, అంత్యోదయ సిద్ధాంతాలు సమాజంలోని చివరి వ్యక్తి అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్నవని తెలిపారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బత్తిని సాయి గౌడ్, జిల్లా నాయకులు మామిడి హరీష్, పున్ని సంపత్, మండల ఉపాధ్యక్షులు చింతలపల్లి తిరుపతిరెడ్డి, కూనబోయిన బాలరాజు, మండల కార్యదర్శి ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, కూనబోయిన పరుశరాములు, కూనబోయిన కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

**ముస్తాబాద్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** ముస్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సౌల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తన జీవితాన్ని దేశ సేవకే అంకితం చేసి, ఏకాత్మ మానవతావాద అంత్యోదయ సిద్ధాంతాలను సమాజానికి అందించారని కొనియాడారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలన్న ఆయన ఆశయాలకు అనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం ఉజ్వల, జనధన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన వంటి పథకాల ద్వారా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ సబ్ కా ప్రయాస్ అనే స్ఫూర్తితో ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా పనిచేయడమే దీన్‌దయాళ్ గారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 2047 నాటికి ఆత్మనిర్భర్, సమృద్ధ, సమర్థ, సంపన్న భారత్ నిర్మాణానికి ప్రతి బీజేపీ కార్యకర్త క్రమశిక్షణతో, నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్,ఉపసర్పంచ్ కోల కృష్ణ,జిల్లెల్ల మల్లేశం,బాధ నరేష్,దీటి సత్యం, వార్డు మెంబర్ వేణు,యాదగిరి,ఒరగంటి సత్యం,వినయ్ బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## నామపూర్ గ్రామానికి పశువుల దావాఖన మంజూరు



**ముస్తాబాద్ సెప్టెంబర్ 25 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి పశువుల దవాఖాన మంజులైనట్లు నామాపూర్ గ్రామ సర్పంచ్ మాదాస్ అనిల్ తెలిపారు. గ్రామ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పశువుల దావిఖన మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దాకర్ బజ్జూర్ కు సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్, తాళ్ల విజయ రెడ్డి పాల్గొన్నారు.

# గంభీరావుపేట కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామం ఎవరికి వారే.. ర్యాలీలు వేర్వేరే!

## సెప్టెంబర్ 30 సభ నేపథ్యంలో చర్చనీయాంశంగా మారిన వేర్వేరు కార్యక్రమాలు



**గంభీరావుపేట సెప్టెంబర్, 25 జనం సాక్షి**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కాంగ్రెస్‌లో ఒకే అంశంపై వేర్వేరు ర్యాలీలు నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సిరిసిల్లలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభకు పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిరుపతిని పార్టీ అధిష్టానం నియమించిన అనంతరం నూతన కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో మాజీ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలోనూ కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మండల కాంగ్రెస్‌లో కార్యక్రమాల నిర్వహణపై స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఒకే అంశంపై రెండు ర్యాలీలు**

సిరిసిల్లకు యంగ్ ఇండియా తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో నూతన మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అభినందన ర్యాలీ నిర్వహించారు. కేజీ టు పీజీ క్యాంపస్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మాజీ మండల అధ్యక్షుడు హమీద్, పర్శ హన్మాండ్లు, గంభీరావుపేట పీఏసీఎస్ చైర్మన్ వేశాల వెంకట్ ఆధ్వర్యంలో మరో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఒకే అంశంపై, ఒకే రోజు రెండు వేర్వేరు ర్యాలీలు జరగడం స్థానికంగా చర్చకు దారితీసింది.



# రాష్ట్రంలోనే ప్రత్యేకం ఇందూరు వినాయకుడి శోభాయాత్ర

### ○జెండా ఊపి ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..
### ○దుబ్బ చౌరస్తా నుంచి వినాయకుల బావి వరకు రథం వెంట ఎమ్మెల్యే..



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 జనంసాక్షి:**
ఇందూరు: రాష్ట్ర రాజధాని తర్వాత ఇందూరులోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందని, ఎంతో ఘన చరిత్ర ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని దుబ్బ చౌరస్తాలో శుక్రవారం రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర ఉద్యమంలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుమేరకు ఇందూరులోనూ వినాయకుడి రథయాత్ర ప్రారంభించారని గుర్తు చేశారు. 21 జతల ఎడ్లతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ముందుకు సాగుతుందన్నారు. యువత భక్తమార్గంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఇందుకు ఇందూరు యువతే నిదర్శనమన్నారు. వందేళ్లుగా రథం శోభాయాత్ర సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. ప్రధానంగా నగరంలోని పలు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు శోభాయాత్ర ఆధ్యాంతం సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.




## పంటలను పరిశీలించిన గురుకుల విద్యార్థులు

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు శుక్రవారం వ్యవసాయ క్షేత్ర పర్యటనలో భాగంగా పంటలను పరిశీలించారు. పత్తి, వరి, సోయా పంటల సాగు విధానం, దిగుబడి, మార్కెట్‌లో విక్రయం, తదితర అంశాలను టీచర్ కవిత, రైతులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## సార్వజనిక గణేష్ శోభాయాత్ర బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 జనం సాక్షి:**
నిజామాబాద్ నగరంలో వినాయక బావి వద్ద మరియు దుబ్బ ప్రాంతం నుంచి ప్రారంభం కానున్న సార్వజనిక గణేష్ శోభాయాత్ర సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య క్షుణ్ణంగా పర్యవేక్షించారు. శోభాయాత్ర సాగే మార్గంలో పోలీస్ బందోబస్తు , ట్రాఫిక్ నియంత్రణ , ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు , ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ సిబ్బంది మోహరింపు తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో సజావుగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని రకాల భద్రతా చర్యలను చేపట్టిందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## చెరువు అలుగును పరిశీలించిన అధికారులు

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని కాస్లాబాద్ గ్రామ ఊర చెరువు అలుగును శుక్రవారం మండల ప్రత్యేక అధికారి బలరాం, ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్ పరిశీలించారు. దుబ్బ తండాకు రాకపోకలు నిలిచిపోవడంతో తాత్కాలిక బడిని ఏర్పాటు చేయాలని, బ్రిడ్జ నిర్మించాలని స్థానికులు కోరారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివాజీ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# వినాయక.. సెలవిక..!

### ○గంగమ్మ ఒడికి గణనాథుడు..
### ○భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జనం..

**సదాశివనగర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అం టూ భక్తుల నినాదాలు.. బ్యాండ్ మేళాల మోత.. డప్పుల దరువులు.. యువత ఉత్సాహం.. మహిళల భక్తిభావం.. చిన్నారుల సందడి.. ఇలా గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో నవరాత్రుల పాటు విశేష పూజలు, భక్తుల నీరాజనాలు అందుకున్న వినాయకుడు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరారు. నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని వినాయకుడి ప్రతిమను వాహనాల్లో ప్రత్యేకంగా అలంకరించి, గ్రామ పురవీధుల్లో భక్తుల నడుమ ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.

**భక్తి పారవశ్యంలో.. యువత సందడిలో..**
శోభాయాత్రలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. బ్యాండ్ మేళాలు, డప్పుల దరువులకు అనుగుణంగా యువత నృత్యాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. మహిళలు, చిన్నారులు సైతం శోభాయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గణపతి నామస్మరణతో గ్రామ వీధులు మార్మోగాయి.

**వీడ్కోలు పలికిన భక్తజనం..**
నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చే సమయంలో భక్తుల్లో భక్తి భావోద్వేగం వెల్లివిరిసింది. "వచ్చే ఏడాది మరింత వైభవంగా రావాలి.. గ్రామ ప్రజలపై గణనాథుడి ఆశీస్సులు ఉండాలి" అంటూ భక్తులు అనంతరం గణనాథుడిని గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు.

# అధికారంలో మౌనం.. ఇప్పుడు కార్మికులపై సానుభూతి!

### అధికారంలో ఉన్నప్పుడు అన్యాయం చేసి, నేడు పీఠం కోల్పోయాక నీతులు వల్లిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 జనంసాక్షి:**
నగరంలో మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ధర్నా చౌక్‌లో చేస్తున్న సమ్మె తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పారిశుద్ధ్య పనులు నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల సమ్మె శిబిరానికి వచ్చి మద్దతు ప్రకటించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. తాము అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల గొంతు నొక్కి, నేడు ప్రతిపక్షంలోకి రాగానే సానుభూతి మాటలు చెబుతున్న ఆయన వైఖరిపై కార్మిక వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కార్మికుల సమ్మె వెనుక అసలు డిమాండ్లు ఇవే. కనీస వేతనం, ప్రస్తుతం ఇస్తున్న రూ. 19,500 వేతనాన్ని పెంచి రూ. 26,000 అందించాలి.
జీవో 52 రద్దు, కార్మికులపాలిట శాపంగా మారిన జీవో నెంబర్ 52ని వెంటనే రద్దు చేయాలి
సకాలంలో వేతనాలు, ప్రతి నెలా 1వ తేదీ నుండి 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలి.
గుర్తింపు కార్డులు ' రక్షణ. రాత్రి వేళల్లో విధి నిర్వహణకు ఐడెంటిటీ కార్డులు మంజూరు చేయాలి. ప్రమాదవశాత్తు చనిపోతే అంత్యక్రియలకు రూ. 20,000 తక్షణ సాయం మరియు మృతుల కుటుంబాలకు వయోపరిమితి సడలించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

**అధికారంలో ఉన్నప్పుడు గొంతు నొక్కి ఇప్పుడు సానుభూతి నాటకాలా?**
జీవో 52 విషం కక్కింది మీరే కదా? మున్సిపల్ కార్మికులను రోడ్డున పడేసిన జీవో నెంబర్ 52ని 2018లో తెచ్చింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే. కార్మికులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవాల్సి వచ్చిందంటే, నాటి ప్రభుత్వానికి కార్మికులపై ఎంత కక్ష ఉందో అర్థం చేసుకోవచ్చు. రూ. 1,000 హామీ ఎగనామం, 2022లో మేడే కానుకగా ప్రతి నెల రూ. 1,000 ఇస్తామని చెప్పి కేవలం రెండు నెలలు మాత్రమే ఇచ్చి ఆపేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న నగర ఎమ్మెల్యే గణేష్ బిగాల ఈ మోసాన్ని ఎందుకు ప్రశ్నించలేదు? ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎందుకు నోరుమెదపలేదు? సర్వాధికారాలు చెలాయించిన నాడు కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోని ఆయన, నేడు పీఠం కోల్పోగానే కార్మికుల భుజాలపై తుపాకీ పెట్టి కాల్చాలని చూస్తున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు కార్మికుల బతుకులను గాలికొదిలేసి, నేడు సమ్మె శిబిరాలొచ్చి సానుభూతి కురిపించడం అత్యంత విడ్డూరంగా ఉందని కార్మికులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ మున్సిపల్ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా తగిన నిర్ణయాలు తీసుకుంటుందా వేచి చూడాలి.



## ఎరువుల కొనుగోలు యాప్ ను వెంటనే తొలగించాలి

## ఆమ్దాపూర్ మహాజన సభలో తీర్మానం

**బోధన్, సెప్టెంబర్ 25 ( జనంసాక్షి ) :**
ఎరువుల కొనుగోలు యాప్ ను వెంటనే తొలగించి తిరిగి పాత పద్ధతిలోనే కొనసాగించాలని శుక్రవారం జరిగిన మాహాజన సభలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బోధన్ మండలం ఆమ్దాపూర్ సహకార సంఘం మాహాజన సమావేశం శుక్రవారం సంఘ అధ్యక్షులు గిర్దవర్ గంగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు కొనుగోలు యాప్ ద్వారా ఎరువులను పంపిణీ చేయడంతో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందువల్ల వెంటనే యాప్ ను తొలగించి తిరిగి పాత పద్ధతిలోనే ఎరువులను అందించాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రాజేశ్వర్, సహకార సంఘం డైరెక్టర్లు, గ్రామ సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## అంజనీలో పత్తి పంట క్షేత్ర ప్రదర్శన

### అనవసర మందులను ఉపయోగించవద్దు: ఎంఏఓ కిషన్

**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
మండలంలోని అంజని గ్రామ శివారులో శుక్రవారం ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో పత్తి పంట క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మండల అధికారి కిషన్ మాట్లాడుతూ... పత్తి పంటకు రసము పీల్చే పురుగు ఆశించిందని తెలిపారు. నివారణకు ఫ్లక్సామెటామైడ్ 10%, ఇమిడాక్లోప్రిడ్ లేదా డయాఫెంథియూరాన్ 50%, ఎసిటామిప్రిడ్ 40%, ఫిప్రోనిల్ 40% మందులలో ఏదైనా ఒక రకం మందును పిచికారి చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదిస్తే తగు మందులను సూచించడం జరుగుతుందని తెలిపారు. అనవసరంగా ఇతర మందులను వాడి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



## నిషేధిత డీజే వినియోగంపై కేసు నమోదు

### గణేష్ మండప నిర్వాహకులు, డీజే ఆపరేటర్‌పై కేసు

**నిజాంసాగర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):**
గణేష్ నిమజ్జనం సందర్భంగా నిషేధిత డీజేను వినియోగించిన ఘటనపై మహమ్మద్‌నగర్ మండలం గిర్నితాండాలో పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే ఏర్పాటు చేసి వినియోగించిన గణేష్ మండప నిర్వాహకులతో పాటు డీజే ఆపరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నిషేధిత డీజేను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వం, పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమతులు లేకుండా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ చర్యలను ఏఎస్ఐ నరసయ్య ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

## అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ..



**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 25(జనంసాక్షి):**
పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత,దేశభక్తికి నిలువెత్తు రూపమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు.బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ,సమాజంలోని చివరి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో దీన్ దయాల్ ఉపాధ్యాయ'అంత్యోదయ'సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని తెలిపారు.ఆయన ఆశయాలు,సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు,జిల్లా నాయకులు, కార్పొరేటర్లు,బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 25, (జనంసాక్షి)**
మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టి, మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు శ్రీరాముల సంజన డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంకమ్మతోటలోని వాజేశ్వరి డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో మహిళలపై దాడులను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంజన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. దేశంలో మహిళలు, బాలికలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. బీహార్, ఢిల్లీలో మైనర్ బాలికలపై జరిగిన ఘటనలతో పాటు తెలంగాణలోని గోదావరిఖనిలో మహిళ హత్య ఘటన ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' నినాదం ప్రచారానికే పరిమితం కాకుండా మహిళలు, బాలికలకు భద్రత కల్పించేలా ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన




చర్యలు తీసుకోవడంతో పాటు రక్షణ చట్టాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. మహిళలు, బాలికలకు భద్రత కల్పించే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో నాయకురాళ్లు రమ్య, శృతి, శిరీష, స్వాతి, శ్రీజ, తేజ, తేజస్విని, చరణ్య తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



## జంగిలోడి తండాలో

## రూ.3 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం

**సిరికొండ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి ):**
సిరికొండ మండలం జంగిలోడి తండా గ్రామపంచాయతీ పరిధిలో 16వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను శుక్రవారం సర్పంచ్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాణావత్ లలితకు రూ.56 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. అలాగే గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక అధికారిగా ఉన్న ఏవో నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి కిషన్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు భజన్నగారి రమేష్, ఉపసర్పంచ్ మాలావత్ కౌసల్య, తండా పెద్దమనుషులు పాల్గొన్నారు.

## భిక్కనూరు మండల కేంద్రంలో ఫుడ్ ఇన్ స్పెక్టర్ తనిఖీలు

**భిక్కనూరు సెప్టెంబర్ 25 (జనం సాక్షి):**
భిక్కనూరు మండల కేంద్రంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.దుకాణాల్లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత తయారు తేదీలు గడువు తేదీలు,వాటి నిల్వ విధానం పరిశుభ్రత తదితర అంశాలను అధికారులు క్షుణంగా పరిశీలించారు. ఈసందర్భంగా దుకాణాల్లో ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిలువ చేయాలని నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ విక్రమ్ సూచించారు. గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక చౌరస్తాలో ఉన్న ఐస్ క్రీమ్, జ్యూస్ స్టాల్ షాప్ ను తనిఖీ చేశారు నాణ్యత తేదీలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు,ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కిరాణా దుకాణాల్లో,స్వీట్ హోమ్స్,బేకరీ తయారీ షాపుల్లో తనిఖీలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.





## ఆపదలో ఆదుకున్న ముఖ్యమంత్రి సహాయ నిధి

### ఐదుగురు నిరుపేదలకు రూ.91 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు

**సిరికొండ సెప్టెంబర్ 25(జనం సాక్షి ):**
సిరికొండ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ నిర్వహించారు. సర్పంచ్ మల్లెల సాయిచరణ్‌తో కలిసి ఉప సర్పంచ్ గ్యామ శోభన్ ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.91 వేల విలువైన చెక్కులను అందజేశారు.అవధూత రాములు రూ.10 వేలు, యార్వ విజయ రూ.20 వేలు, యార్వ గంగు రూ.7 వేలు, అవధూత అర్చన రూ.16 వేలు, సభావాత్ సౌమ్య రూ.38 వేల చొప్పున ఆర్థిక సాయం పొందారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కనగందుల మురళి, చిట్యాల రంజిత్, ఎరుకల ఎల్లయ్య, ఇందూరి అమృత, బాదావత్ తిరుపతి, నాయకులు చాకలి రమేష్, మామిళ్ల దిగంబర్, కొలిపాక సుమన్, బాడాల లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.